అమాత్యా.. ఆలకించరా?

మంత్రి దుద్దిళ్ల ఇలాకా.. రైతుకు ధోకా!

మొదటిపేజీ తరువాయి...

రంగాపూర్ గ్రామాల్లోని అనేక మంది రైతులకు రుణ మాఫీ కాక ఆందోళనకు గురవుతున్నారు. బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా సరైన సమాధానం లభించడంలేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తచేస్తున్నారు. ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి జిల్లాలో మొదటి విడుతలో 29,724 మంది రైతులకు రూ. 149.42కోట్లు, రెండో దఫా 13,238 మందికి రూ. 122.43 కోట్లు, మూడో విడుతలో 8,268 మందికి రూ. 101.75కోట్లు, మొత్తంగా జిల్లావ్యాప్తంగా 51,393 మంది రైతులకు రూ. 375.58 కోట్ల రుణమాఫీ చేశారు. మాఫీ ప్రక్రియ పూర్తయిందని స్వయంగా సీఎం ప్రకటించడంతో రుణ మాఫీ కానీ దాదాపు 60శాతం మంది పరిస్థితి ఏమిటని రైతులు మదనపడుతున్నారు. రొంపికుంటకు చెందిన 300మంది రైతులు పెద్దపల్లిలోని ఇండియన్ బ్యాంక్, సబ్బితంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కమాన్‌పూర్‌లోని కేడీసీసీ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. ఇందులో 40 శాతం మంది రైతుల రుణాలు మాత్రమే మాఫీ కాగా లక్షలోపు రుణాలు ఇంకా మాఫీకి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో నమస్తే తెలంగాణ వారిని పలకరించగా వారి మనోభావాలను ఇలా వెల్లడించారు.

రొంపికుంట గ్రామ పంచాయతీ వద్ద రుణమాఫీ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



జంగిలి శ్రావణ్‌కుమార్ అనే రైతుకు రుణమాఫీ జరిగినట్టు వచ్చిన మెసేజ్

సీఎం రాజీనామా చేయాలి

రెండు గడువులు దాటినా రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ జరగలేదు. రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేస్తారా? సంపూర్ణంగా రైతులకు రుణమాఫీ చేస్తారా? అనే విషయాన్ని తేల్చుకోవాలి. మా గ్రామంలో 150 మంది రైతులకు రుణమాఫీ కాలేదు. రుణమాఫీ చేయని పక్షంలో ఆందోళనకు దిగుతాం.

-కొయ్యడ రవి, రొంపికుంట, కమాన్‌పూర్

మాఫీ డబ్బులు జమ కాలేదు..

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రూ.18వేల లోన్ తీసుకున్నా. తొలివిడుత రుణమాఫీ జాబితాలో పేరు వచ్చింది. బ్యాంకులో అడిగితే అసలు మాఫీ అయ్యిందని, వడ్డీ కట్టి, వన్ బీ పహాణీ, ఆధార్ జిరాక్స్ ఇవ్వమన్నారు.వడ్డీ రూ.1300 కట్టి, ధృవీకరణ పత్రాలు ఇచ్చిన. నెల అవుతున్న ఇంకా ప్రభుత్వం నుంచి ఖాతాకు డబ్బులు రాలేదు.

- జంగిలి శ్రావణ్‌కుమార్, రొంపికుంట

ఖాతా లెక్కలు చెప్పలేరు

కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు పెద్దపల్లి ఇండియన్ బ్యాంక్‌లో రూ. లక్ష రుణం 2023 ఆగస్టులో ఒక్కసారే మాఫీ అయింది. మళ్లీ అదే బ్యాంక్‌లో 28 అక్టోబర్ 2023న రూ.52వేల లోన్ తీసుకున్న. రుణమాఫీ అయ్యేందుకు అన్ని అర్హతలు ఉన్నా.. మూడు విడుతల్లోనూ మాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే నేను 2016లో రుణం తీసుకున్నట్టు చెబుతున్నరు. నేను 2016లో రుణం తీసుకుంటే కేసీఆర్ చేసిన మాఫీ ఎటు పోయిందని అని అడిగితే కసురుకుంటున్నరు. ఖాతాలెక్కలు అడిగితే కర్సయితయ్ అంటున్నరు.

-కే రవి, రొంపికుంట, కమాన్‌పూర్

మాఫీపై సమజైతలేదు

కేసీఆర్ హయాంలో నాకున్న లోను రూ. 49వేలు వడ్డీతో రూ. 54వేలు ఒకేసారి మాఫీ అయ్యింది. మళ్లీ ఆగస్టు నెలలోనే పెద్దపల్లి ఇండియన్ బ్యాంక్‌లో రూ. 54వేలు రుణం తీసుకున్నా. రైతు రుణమాఫీకి నాకు అన్ని అర్హతలున్నాయి. కానీ మూడు లిస్ట్‌ల్లోనూ నా పేరు రాలేదు. గిట్లేందుకు అయిందో సమజైతలేదు.

-కే మల్లేశ్, రొంపికుంట, కమాన్‌పూర్

రైతులతో ఆందోళన చేస్తాం

రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోంది. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మాఫీ చేసింది పావలా వంతు. చెప్పుకునేది రూపాయి వంతు. అర్హులందరికీ రుణమాఫీ చేయాలి. మాఫీ చేయకపోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తాం.

- ఉప్పరి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ, కమాన్‌పూర్

40 శాతం మందికే మాఫీ..

మా కమాన్‌పూర్ మండలంలో 40శాతం మంది రైతులకే మాఫీ అయింది. కమాన్‌పూర్ సహకార సంఘం నుంచి 34మంది, పెద్దపల్లి ఇండియన్ బ్యాంక్ నుంచి 80 మంది, సబ్బితంలోని ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంకు నుంచి దాదాపు 200ల మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు. రైతులను ఇబ్బంది పెట్టడం రేవంత్ సర్కారుకు తగదు.

- చిందం తిరుపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్, కమాన్‌పూర్

బ్యాంకుల్లో బారులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో యూరియా బస్తాల కోసం గంటల కొద్ది రైతులు క్యూలైన్‌లో నిల్చొని ఉండేవాళ్లు. ఇప్పుడు రుణమాఫీ కోసం బ్యాంకుల ముందు గంటల తరబడి బారులు తీరుతున్నరు. రొంపికుంటలో చానామందికి రుణాలు మాఫీ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ రుణమాఫీ చేయాలి.

-కొయ్యడ కుమార్, రొంపికుంట, కమాన్‌పూర్

కాంగ్రెస్ గొప్పలు సిగ్గుచేటు

పెద్దపల్లి ఇండియన్ బ్యాంకులో రూ. 80 వేలు లోన్ తీసుకున్న. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడతల్లో నా పేరు రాలేదు. లక్ష లోపు ఉన్న నాకు మాఫీ కాకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పడం సిగ్గుచేటు. రైతులు ఆగమవుతుంటే వరంగల్‌లో రుణమాఫీ కృతజ్ఞత సభ పెడుతామని కాంగ్రెస్ నేతలు చెప్పడం విడ్డూరం.

-తాళ్ల కనకయ్య, తెనుగుపల్లి, కమాన్‌పూర్

రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పింది

- కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పిందని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ విమర్శించారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో రూ.40 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించి, బడ్జెట్లో రూ.26 వేల కోట్లు కేటాయించారని.. చివరికి రూ.17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని మండిపడ్డారు. 64 లక్షల మంది రుణాలు తీసుకుంటే 22 లక్షల మందికే మాఫీ చేస్తారా? అని ప్రశ్నించారు. రుణమాఫీ కాకపోవడంతో రైతులు కడుపుమండి కాంగ్రెస్ దిష్టిబొమ్మలను కాలుస్తున్నారని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రుణమాఫీ సహా 6 గ్యారెంటీలపై చర్చను పక్కదారి పట్టించేందుకు విలీన డ్రామాలు ఆడుతున్నదని కాంగ్రెస్‌పై మండిపడ్డారు.

రెన్యువల్ చేసినా రుణమాఫీ కాలె



2019లో రూ.2 లక్షల రుణం తీసుకున్న. అప్పటి నుంచి ఏటా మిత్తి చెల్లించి రెన్యువల్ చేస్తున్నా. మూడు రోజుల క్రితం రూ.2 లక్షల్లోపు రుణమాఫీ అయినట్టు తెలిసి బ్యాంకుకు వెళ్లి అడిగితే మాఫీ కాలేదని చెప్పిన్రు. మా గ్రామంలో చాలామంది రైతులకు పంట రుణాలు మాఫీ కాలేదు. రుణ మాఫీ చేసి నాకు న్యాయం చేయాలి.

- కూకట్ల వీరన్న, పోచారం, మహబూబాబాద్ జిల్లా

మేం రైతులం కాదా? మాకెందుకు మాఫీ కాదు



నా భర్త ప్రభాకర్ పేరున రూ.2 లక్షలు తీసుకున్నం. దానికి వడ్డీ కలిపితే రెండు లక్షలు దాటుతది. వడ్డీ పైసలు కడుతామని బ్యాంకుకు పోతే పట్టించుకునే వారే లేరు. కొందరికే మాఫీ అయితే ఎలా? మేం రైతులం కాదా?

- కొత్తూరు తిరుపతమ్మ, జంగాలపల్లి, ములుగు జిల్లా

2 లక్షల మాఫీ ఒక్కరికీ కాలేదు

- జుక్కల్‌లో రైతులకు మొండిచెయ్యి
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం

సంగారెడ్డి, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రూ. 2లక్షల రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ గ్రామంలోని రైతుల్లో కనీసం ఒక్కరికి కూడా 2లక్షల రుణమాఫీ కాలేదు. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని జుల్కల్ గ్రామ పంచాయతీలో 3వేల జనాభా, 2800 ఎకరాల వ్యవసాయభూమి ఉంది. 1000 మందికిపైగా రైతులు ఉన్నారు. వీరిలో సన్న, చిన్నకారు రైతులే ఎక్కువ. గ్రామంలోని 500 మందికిపైగా రైతులు కందిలోని ఎస్‌బీఐ, కోఆపరేటివ్ బ్యాంకుల్లో పంటరుణాలు తీసుకుంటున్నారు. రేవంత్ సర్కార్ గ్రామంలో మొదటి విడతగా 158 మంది, రెండో విడతలో 72 మంది రైతులకు రుణమాఫీ చేసింది. మూడో విడతలో ఒక్కరికీ పంటరుణం మాఫీ కాలేదు. దీంతో గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ మార్గదర్శకాల ప్రకారం గ్రామంలో 70 శాతానికి పైగా రైతుల రుణాలు మాఫీ కావాలని, కానీ సగం మందికి కూడా రుణమాఫీ కాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నమ్మించి మోసం చేయొద్దు

నేను కోఆపరేటివ్ బ్యాంకులో రూ.1.94 లక్షల పంట రుణం తీసుకున్నా. రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పటంతో సంతోషపడ్డా. కానీ నాకు రూ.1.94 లక్షల పంటరుణం మాఫీ కాలేదు. ప్రభుత్వం నాలాంటి రైతులను నమ్మించి మోసం చేయడం సరికాదు.

-కొత్తగాడి నర్సింలు, జుల్కల్, సంగారెడ్డి జిల్లా

ఆశలు అడియాసలయ్యాయి

కంది కోఆపరేటివ్ బ్యాంకులో రూ.2 లక్షల పంట రుణం తీసుకున్న. అర్హత ఉన్నా నాకు రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదు. రేషన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు అన్నీ ఉన్నాయి. రేవంత్ సర్కార్ నా ఆశలను అడియాసలు చేసింది. ప్రభుత్వం నాకు న్యాయం చేయాలి.

-కలివేముల పాండు,జుల్కల్, సంగారెడ్డి జిల్లా

దండం పెడతా.. మాఫీ చేయండి



మా కుటుంబంలో మా అమ్మకు, నాకు పంట రుణం ఉంది. పట్టాదారు పాస్‌పుస్తకాలు వేర్వేరుగా ఉన్నాయి. మూడు విడతల్లోనూ మాకు లోన్ మాఫీ కాలేదు. అటు రైతుభరోసా ఇవ్వక, ఇటు రుణమాఫీ కాక కష్టాలు పడుతున్నాం. రుణ మాఫీ చేస్తే మళ్లీ రుణం తీసుకొని పంటలు సాగు చేసుకుంటాం కదా? సీఎం గారూ.. మీకు దండం పెడతాం.. మా రుణాలు మాఫీ చేయండి.

-మాలోత్ పూల్‌సింగ్, మంగ్యాతండా, టేకులపల్లి

రేషన్‌కార్డు లేకుంటే మాఫీ చేయరా?



దుమ్ముగూడెం సహకార బ్యాంకులో రెండేండ్ల క్రితం రూ.18 వేల పంట రుణం తీసుకున్నాను. మూడు విడతల్లోనూ నా పేరు రాలేదు. బ్యాంకు సిబ్బందిని అడిగితే సమాచారంలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులనూ సంప్రదించాను. మా నాన్న రేషన్‌కార్డులో నా పేరు ఉందని చెప్పారు. నాకు సపరేట్ రేషన్‌కార్డు లేనంత మాత్రాన నా పంట రుణాన్ని మాఫీ చేయరా?

-కాశిబోయిన సతీశ్, బండిరేవు, దుమ్ముగూడెం

● మా ఇంట్లో ఎవరికీ మాఫీ చేయలే..

మా ఇంట్లో నేను, నా భార్య రాజ్యలక్ష్మి, కొడుకులు సేనాపతి, సతీశ్ ఉంటున్నాం. అందరికీ ఒకటే రేషన్ కార్డు ఉన్నా, వేర్వేరుగా ఉంటున్నాం. పట్టాపాస్ పుస్తకాలు కూడా వేర్వేరుగా ఉన్నాయి. అయితే, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడతల్లో చేసిన రుణమాఫీలో మాలో ఒక్కరికి కూడా కాలేదు. నా పేరు మీద రూ.1.50 లక్షలు, నా భార్య పేరు మీద రూ.2.74 లక్షలు, నా కొడుకు సతీశ్ పేరున రూ.98 వేలు, సేనాపతి పేరుమీద రూ.1.10 లక్షల రుణం ఉన్నది. మాలో ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలె. గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినం. వ్యవసాయ అధికారులను కలిసినం. ఎవరూ సమాధానం చెప్పడం లేదు. మా లెక్క మా ఊరిలో చాలామంది రుణ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు.

- మార్నెల్ల కొమురయ్య రైతు, కాశీంపల్లి, భూపాలపల్లి

గోవాలో డ్రగ్స్‌తో పట్టుబడిన తెలంగాణ వ్యక్తి

పనాజీ (గోవా): తెలంగాణకు చెందిన సయ్యద్ అసిఫ్ జిబ్రాన్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీస్ సూపరింటెండెంట్ (నార్త్) అక్షత్ కౌశల్ ఆదివారం మీడియాకు తెలిపారు. నిందితుని వద్ద నుంచి రూ.1.05 లక్షల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ జీవ్‌బా దల్వీ నేతృత్వంలోని బృందం గోవాలోని పెర్నెమ్‌లో శని-ఆదివారాల మధ్య రాత్రి నిర్వహించిన సోదాల్లో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అమెరికాలో 'స్లాప్డ్ చీక్ వైరస్'

- గర్భిణులకు రిస్క్ ఎక్కువ
- 'సీడీసీ' మార్గదర్శకాలు

వాషింగ్టన్, ఆగస్టు 18: అమెరికాలో 'పార్వోవైరస్ బీ19' (స్లాప్డ్ చీక్ సిండ్రోమ్) కేసులు పెరుగుతున్నాయని ఆ దేశానికి చెందిన 'సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ప్రివెన్షన్' (సీడీసీ) తాజాగా హెచ్చరికలు జారీచేసింది. వైరస్‌తో గర్భిణులకు తీవ్ర ముప్పు పొంచివుందని, గర్భస్రావం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని సీడీసీ మార్గదర్శకాల్లో పేర్కొన్నది. దేశంలో 2022 నుంచి 2024 నాటికి పిల్లల్లో కేసుల సంఖ్య 15 నుంచి 40శాతం పెరిగిందని తెలిపింది. రోగి తుమ్ములు, దగ్గు ద్వారా వైరస్ ఇతరులకు సోకుతుంది. చెంపల మీద ఎవరో కొట్టినట్టుగా ఎరుపు రంగులో దద్దుర్లు ఉండటం ఈ వ్యాధి ముఖ్య లక్షణం. పిల్లల్లోనే ఇది కనపడుతుంది. పెద్దల్లో పొట్ట, ఛాతి, తొడలపై దద్దుర్లు ఏర్పడతాయి. చాలా మందిలో వ్యాధి రెండు లేదా మూడు వారాల్లో దానంతట అదే తగ్గిపోతుంది. అయితే, రోగ నిరోధకత బలహీనంగా ఉన్నవారిలో, రక్త సంబంధిత రుగ్మతలు, గర్భిణుల్లో ఈ వ్యాధి తీవ్రంగా పరిణమిస్తున్నది. జ్వరం, ముక్కు కారటం, గొంతు, తల, కీళ్ల నొప్పులు, కడుపుబ్బరం, చెంపలపై దద్దుర్లు.. మొదలైనవి వ్యాధి లక్షణాలు.

డబ్బులిస్తాం.. దేశం వీడి వెళ్లిపోండి!

- స్వీడన్ విచిత్ర ప్రతిపాదన
- విదేశాల్లో పుట్టి.. తమ దేశంలో స్థిరపడిన వారికి ఆఫర్
- ప్రయాణ ఖర్చులు కూడా భరించేందుకు ప్రతిపాదనలు
- ఇప్పటికే వలసదారులకు అమలు
- జనాభా పెరుగుదలే కారణం?

స్టాక్‌హోం, ఆగస్టు 17: దేశంలోకి అధిక స్థాయిలో వస్తున్న వలసలను నియంత్రించేందుకు, జనాభాను తగ్గించుకొనేందుకు స్వీడన్ ఒక ప్రతిపాదన తీసుకొచ్చింది. ఇతర దేశాల్లో పుట్టి తమ దేశంలో నివాసం ఉంటున్న వారిని దేశం నుంచి పంపించేందుకు డబ్బులు ఆఫర్ చేస్తున్నది. 'మేం డబ్బు ఇస్తాం.. మీరు దేశం వీడండి' అనే విధంగా కొంత మొత్తంలో డబ్బును ఇచ్చే స్కీమ్‌ను ప్రవేశపెట్టే ఆలోచనలో దేశ ప్రభుత్వం ఉన్నది. ఈ స్వచ్ఛంద ఎగ్జిట్ స్కీమ్‌లో భాగంగా ఇతర దేశాల్లో పుట్టిన స్వీడిష్ పౌరులు ఎవరైనా, దేశం వీడి వెళ్లాలని అనుకొంటే వాళ్లకు 10 వేల స్వీడిష్ క్రౌన్లు(సుమారు రూ.80 వేలు) ఇవ్వనున్నారు. దీంతో పాటుగా వారి ప్రయాణ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించనున్నది. పిల్లలకు 5 వేల స్వీడిష్ క్రౌన్లు ఇస్తారు. ఈ మొత్తాన్ని వన్‌టైమ్ పేమెంట్‌లోనే చెల్లిస్తారు. ఇప్పటికే శరణార్థులు వలసదారులకు వర్తింపచేస్తున్న ఈ స్కీమ్ పరిధిలోకి దేశ పౌరులను కూడా తీసుకురావలని స్వీడన్ ప్రభుత్వం యోచిస్తున్నది. స్కీమ్‌లో భాగంగా ఇచ్చే గ్రాంట్‌ను పెంచాలన్న ప్రతిపాదనలను ప్రభుత్వం తిరస్కరించింది. అలా చేస్తే స్వీడన్ తమ దేశ పౌరులను ఇష్టపడటం లేదనే ప్రతికూల సంకేతం పంపుతుందని అధికారిక వర్గాలు తెలిపాయి.

కారణం ఏంటి?

ప్రపంచంలోని పలు దేశాల నుంచి భారీగా వలసలు వచ్చి స్వీడన్‌లో సెటిల్ అవుతున్నారు. దీంతో ఈ యూరప్ దేశ జనాభా గత 20 ఏండ్లలో రెండింతలు అయింది. దీంతోపాటు దేశంలో వలసదారుల సంఖ్య 20 లక్షలకు పైగా ఉండొచ్చని ఒక అంచనా. ఇది స్వీడన్ జనాభాలో ఐదో వంతు. వలసలను నియంత్రించేదుకు 2015 నుంచి ప్రభుత్వం పలు రకాల ఆంక్షలు తీసుకొచ్చినా, పెద్దగా ఫలితం కనిపించలేదు. దీంతో జనాభా నియంత్రణకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.

గత 50 ఏండ్లలో తొలిసారి..

గత ఏడాది దేశంలోకి వలస వచ్చే వారి కంటే దేశం వీడి పోయే వారి సంఖ్య ఎక్కువగా ఉన్నదని గణాంకాలు పేర్కొన్నాయి. గత 50 ఏండ్లలో ఈ విధంగా జరగడం ఇదే తొలిసారి. తమ దేశానికి వచ్చే వాళ్లు.. స్వీడిష్ సమాజంలో ఇమడలేకపోతున్నారు. అలాంటి వారు దేశం విడిచి వెళ్లేందుకు ఇదొక గొప్ప అవకాశం. ప్రభుత్వం ఆర్థిక సాయం కూడా చేస్తుంది' అని స్వీడన్ ఇమ్మిగ్రేషన్ మంత్రి మారియా మాల్మెర్ పేర్కొన్నారు. అయితే స్వీడన్ అనుసరిస్తున్న ఈ విధానంపై ఆర్థికవేత్త సంజీవ్ సన్యాల్ విమర్శలు చేశారు. 'విదేశాల్లో పుట్టిన తమ దేశ పౌరులను స్వచ్ఛందంగా పంపించేందుకు స్వీడన్ ఒక స్కీమ్‌ను ప్రవేశపెడుతున్నది. ఇప్పటికే స్వీడన్ పాస్‌పోర్టు ఉన్న వాళ్లకు కూడా దీన్ని వర్తింపజేయడం గమనించాల్సిన అంశం. ఇది ఎలాంటి ప్రజాస్వామ్యాన్ని సూచిస్తుంది?' అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

నేడు బ్లూ సూపర్‌మూన్ కనువిందు

న్యూఢిల్లీ : ఆకాశంలో సోమవారం అద్భుత దృశ్యం ఆవిష్కృతం కానుంది. సంపూర్ణ, బ్లూ సూపర్‌మూన్ ఆకాశంలో కనువిందు చేయబోతున్నది. నాసా తెలిపిన వివరాల ప్రకారం, ఆదివారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు పూర్ణ చంద్రుడు దర్శనమిస్తాడు. భారత్, ఆస్ట్రేలియా సహా ఆసియా దేశాల్లో మంగళవారం మరింత స్పష్టంగా చంద్ర దర్శనం జరుగుతుంది. మన దేశంలో ఈ ఫుల్, బ్లూ సూపర్‌మూన్ సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కనిపిస్తుంది. ఆగస్టులో కనిపించే పూర్ణ చంద్రుడిని స్టర్జియన్ మూన్ అని అల్గోంక్విన్ తెగలకు చెందినవారు పిలుస్తారు. ఈ కాలంలో సులువుగా పట్టుబడే భారీ చేప పేరు మీద ఈ నామకరణం చేశారు. దీనికి రెడ్ మూన్, కార్న్ మూన్, బార్లీ మూన్, హెర్బ్ మూన్ అనే పేర్లు కూడా ఉన్నాయి. తదుపరి సూపర్‌మూన్ వచ్చే నెల 17న కనిపిస్తుంది. దీనిని హార్వెస్ట్ మూన్ అని పిలుస్తారు. ఆ తర్వాత అక్టోబరు 17న కనిపించే పూర్ణ చంద్రుడిని హంటర్స్ మూన్ అంటారు. ఈ సంవత్సరంలో చివరిగా నవంబరు 15న సూపర్‌మూన్ కనిపిస్తుంది.

మలయాళీ నటుడు మోహన్‌లాల్‌కు అస్వస్థత



కొచ్చి: మలయాళీ నటుడు మోహన్‌లాల్‌ను కొచ్చిలోని ఓ దవాఖానలో చేర్పించారు. ఆయన కండరాల నొప్పి, తీవ్ర జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో బాధపడుతున్నారు. ఆయన శ్వాస సంబంధిత వైరల్ ఇన్ఫెక్షన్‌కు గురైనట్లు తెలుస్తున్నది. ఆయనను ఐదు రోజులపాటు ఏకాంతంగా ఉండాలని వైద్యులు సూచించారు. 'ఎల్2:ఎంపురాన్' చిత్రీకరణ, 'బరోజ్' పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పూర్తయిన తర్వాత ఆయన గుజరాత్ నుంచి కొచ్చి వచ్చారు. గుజరాత్‌లో ఆయన అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన వేగంగా కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

పెరుగుతున్న జనాభా దేశానికి పెను సవాల్

ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి

ప్రయాగ్‌రాజ్, ఆగస్టు 18: రోజురోజుకు పెరుగుతున్న జనాభా దేశానికి పెద్ద సవాల్ అని, ఎమర్జెన్సీ కాలం నుంచి భారతీయులు జనాభా నియంత్రణను పట్టించుకోవడమే మానేశారని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణ మూర్తి అన్నారు. ప్రయాగ్‌రాజ్‌లోని మోతీలాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆదివారం జరిగిన స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధిక జనాభా, తలసరి భూమి లభ్యత, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలలో భారత్ ప్రధానమైన సవాళ్లను ఎదుర్కొంటున్నదని అన్నారు. దేశంలో అత్యవసర పరిస్థితులు విధించిన నాటి నుంచి భారతీయులు జనాభా నియంత్రణపై తగిన శ్రద్ధపెట్టలేదని, దీని కారణంగా మన దేశం అస్తవ్యస్తంగా మారే ప్రమాదం ఏర్పడిందని ఆయన అన్నారు. మనతో పోలిస్తే బ్రెజిల్, చైనా, అమెరికా లాంటి దేశాల్లో చాల అధికంగా తలసరి భూమి లభ్యత ఉందని అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరిలో అన్నపూర్ణ పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి బయటికి దూకుతున్న గోదారి జలాలు

సాగర్ రెండు గేట్ల ఎత్తి నీటి విడుదల

- మేడిగడ్డ బరాజ్‌లో పెరిగిన వరద
- పరుగులు పెడుతున్న కాళేశ్వర జలాలు

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 18 (నమస్తేతెలంగాణ): శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో కొనసాతుండటంతో నాగార్జునసాగర్ డ్యామ్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 24,920 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ కాల్వ ద్వారా 6,791, కుడి కాల్వ ద్వారా 8,067, ప్రధాన జలవిద్యుత్తు కేంద్రం ద్వారా 29,151, వరద కాల్వ ద్వారా 600, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 71,329 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే.. అంతే మొత్తంలో అవుట్‌ఫ్లో కొనసాగిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని మేడిగడ్డ బరాజ్‌కు వరద ప్రవాహం పెరుగుతున్నది. శనివారం బరాజ్ ఇన్‌ఫ్లో 1,75,430 క్యూసెక్కులు ఉండగా, ఆదివారం 2,12,030 క్యూసెక్కులకు పెరిగింది. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. ఆదివారం ఎగువ నుంచి 2,68,070 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్టు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బరాజ్‌లోని మొత్తం 59 గేట్లను ఎత్తి వచ్చిన నీటి వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌కు జలాలు చేరుతుండగా.. ఆదివారం 5, 6 మోటర్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోశారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. ఇక్కడ రెండు మోటర్ల (3,4)ను ఆన్ చేసి 6,300 క్యూసెక్కుల నీటిని శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు ఎల్లంపల్లి నుంచి 15.5 టీఎంసీలకు పైనే జలాలు మధ్య మానేరుకు తరలించినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మధ్యమానేరు నుంచి సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరిలోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు నీటిని తరలిస్తున్నారు. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా, పంప్‌హౌస్‌లో రెండు బాహుబలి మోటర్ల ద్వారా 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి తరలిస్తున్నారు. ఇక్కడ జలాశయం గేట్లు ఓపెన్ చేసి రంగనాయక సాగర్‌కు వదులుతున్నారు.

నా ముందు మూడు దారులు: చంపాయి సోరేన్

న్యూఢిల్లీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జేఎంఎం నేత చంపాయి సోరేన్ ఆదివారం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీ తనను అవమానించడంతో తన ఆత్మాభిమానం దెబ్బతిందని, తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానని తెలిపారు. హేమంత్ సోరేన్‌కు బెయిలు మంజూరైన తర్వాత తనను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరడం తనను తీవ్రంగా బాధించిందని చెప్పారు. చంపాయి సోరేన్ ఆదివారం న్యూఢిల్లీకి వెళ్లారు. ఆయన బీజేపీలో చేరుతారనే ప్రచారం జరిగింది. అయితే ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, తాను వ్యక్తిగత పనుల కోసం న్యూఢిల్లీకి వచ్చానని చెప్పారు. శాసన సభ ఎన్నికలు జరిగే వరకు ఈ ప్రయాణంలో తనకు అన్ని దారులు తెరిచే ఉన్నాయని అనంతరం ఎక్స్‌లో తెలిపారు. జేఎంఎం సభ్యులతో ఆయన మాట్లాడుతూ, ఈ రోజు (ఆదివారం) నుంచి తన జీవితంలో నూతన అధ్యాయం ప్రారంభమైందని చెప్పారు. ''నా ముందు 3 దారులు ఉన్నాయి. మొదటిది, రాజకీయాల నుంచి విరమించుకోవడం; రెండోది, సొంతంగా ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసుకోవడం; మూడోది, ఈ మార్గంలో ఓ సహచరుడు కనిపిస్తే, ఆ సహచరుడితో ప్రయాణాన్ని కొనసాగించడం'' అని వివరించారు.